క్లుప్తంగా

70 మందికి వైద్య పరీక్షలు

ఐరాల: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. శనివారం మండలంలోని పేయన్నగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం.. తల్లీబిడ్డకు క్షేమం


చారాలలో వైద్యం చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు క్షేమమని వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చారాల, కారకాంపల్లెలో వేర్వేరుగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరివైద్య, సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రోబోటిక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: జాతీయ స్థాయి ఆరో రోబోటిక్ పోటీల్లో బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని స్కూల్ చైర్మన్ శైలజాకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ చెన్నైలోని విట్ విశ్వవిద్యాలయంలో జరిగిన రోబోటిక్ పోటీల్లో తమ పాఠశాల నుంచి 68 మంది విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించారు. అందులో 31 మంది బహుమతులు సాధించినట్లు వివరించారు.

ఇంటి స్థలాల పంపిణీకి డిమాండ్


అర్జీలు రాయిస్తున్న సీపీఐ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు నగరంలోని లెనిన్‌నగర్, హౌసింగ్‌కాలనీ, మంగసముద్రంహౌసింగ్‌కాలనీలో పర్యటించి అర్హులతో అర్జీలు రాయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ వినతి పత్రాలను సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు గోపీనాథ్, మణి, రమాదేవి, విజయ్‌కుమార్, విజయగౌరీ, కుమారి, కవిత, లతారెడ్డి, రఘు, చాంద్‌బాషా, కార్తీక్ పాల్గొన్నారు.

ఢిల్లీ విజయంపై హర్షం


నినాదాలు చేస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు ప్రజాస్వామ్య పరిపాలన, డబుల్ ఇంజన్ సర్కారును కోరుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎంపీ దుర్గా, నేతలు చిట్టిబాబు, శ్రీనివాస్, రామభద్ర పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పులిచెర్ల(కల్లూరు): దేవళంపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ జరిగి 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం, అనంతరం ప్రాకార ఉత్సవం, భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు అర్చకులు అనంత కుమార ఆచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

యాదమరిలోని ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న మండల వైద్య బృందం (ఫైల్)



రోగి ప్రాణం గుల్ల

తల్లిదండ్రులు జన్మనిస్తే .. వైద్యులు పునః జన్మ ఇస్తారని భగవంతుడితో పోలుస్తారు. ఇంతటి పవిత్రమైన వృత్తిలోకి అడ్డదారుల్లో చట్టం లొసుగులను ఆసరా చేసుకొని ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతున్నారు. మిడిమిడి వైద్యం చేసి ప్రాణాల మీదకు తెస్తున్నారు. ప్రాణాలు పోతే బాధిత కుటుంబాలను ప్రలోభాలకు గురిచేయడం లొంగని వారిని నేతల అండదండలతో బెదిరిస్తున్నారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలని చట్టం చెబుతున్నా నిబంధనలు ఉల్లంఘించి రోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అధికారులు మాత్రం నాయకుల ఒత్తిళ్లతో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

- ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు కూటమి నేతల సహకారం
- తనిఖీలు చేసిన అధికారులపై ఒత్తిళ్లు
- కుర్చీలకే పరిమితమవుతున్న అధికారులు
- రెచ్చిపోతున్న నకిలీ వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లతో ఆర్‌ఎంపీ, పీఎంపీలు పుట్టుకొచ్చి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు.


యాదమరి ఓఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్న మందులు, మాత్రలు, సెలైన్ బాటిళ్లు (ఫైల్)

వీరికి కూటమి నేతల అండదండలున్నాయి. దీంతో తనిఖీలకు వెళ్లిన జిల్లా ఆరోగ్యశాఖ అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. వినని వారని బెదిరిస్తున్నారు. దీంతో అధికారులు వారిపై చర్యలకు వెనుకాడుతున్నారనే విమర్శలొస్తున్నాయి.

తనిఖీలేవీ?

ఆర్‌పీఎంల వైద్యంతో ప్రాణాల మీదుకు తెచ్చుకున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నా వారి కట్టడికి చర్యలు తీసుకోవడం లేదు. కొందరు ఇదే అవకాశంగా భారీ మొత్తంలో నగదు గుంజుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మరికొందరు అధికారులు మాత్రం ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి తనిఖీలకు వెళుతున్నారు. అయితే ఆ తనిఖీలకు వెళ్లినప్పుడు మందులు, మాత్రలు, ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు, పశువులకు సంబంధించిన మందులు, మాత్రలు సైతం పట్టుపడుతున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాలంటే తనిఖీ అధికారులు జంకుతున్నారు. కాని పక్షంలో మందలించి వదిలేస్తున్నారు. ఆర్‌ఎంపీల వైద్యం వికటించి, బాధితులు రోడ్డుపైకి వస్తే తప్ప అధికారుల్లో కదలిక రావడంలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో కట్టడికి చర్యలు

నకిలీ వైద్యులు కట్టడికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామీణులు నకిలీ వైద్యానికి బలవుతున్నారని గుర్తించి.. వారికి మంచి వైద్యం అందించే దిశగా అడుగులు వేసింది. డాక్టర్ వైఎస్సార్ పేరుతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తెరపైకి తీసుకొచ్చింది. రూ.లక్షలు వెచ్చించి సచివాలయ పరిధిలో హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించింది. ఆ కేంద్రానికి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను తీసుకొచ్చింది. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలను అక్కడ సేవలు అందించేలా చేసింది. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులోకి తెచ్చి పేద ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంలా నిలిచింది. దీంతో పాటు పల్లె ముంగిటకే డాక్టర్‌ను రప్పించి వైద్య సేవలను మరింత చేరువ చేసింది. జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటా వైద్య పరీక్షలు చేయించి, ఆరోగ్య సమస్యలను తెలుసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లె వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వకపోవడం శాపమైంది. ఫలితంగా పీఎంపీలు, ఆర్‌పీఎంలు మళ్లీ పుంజుకుంటున్నారనే మాట వినిపిస్తోంది..

అడ్డూ అదుపులేని ఆగడాలు

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సను పక్కన పెట్టి మిగిలిన అన్ని రకాల వైద్యం చేస్తున్నారు. పలు రకాల వైద్యం పేరుతో రోగుల జేబులు కొల్లగొడుతున్నారు. అర్హత లేకపోయినా అడుగడుగునా క్లినిక్‌లు నడుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,500కు పైగా ఆర్‌ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఇందులో ఐడీ కార్డులు, సర్టిఫికెట్లు ఉన్నవారు 1500 వరకు ఉన్నారని, వీరిలో కూడా అర్హులెంత మందో తెలియదని పలువురు ఆర్‌ఎంపీలే చెబుతుండడటం గమనార్హం!

ఇదీ వారి బలం...

ఎక్కడైనా ఆర్‌ఎంపీలకు చిన్న సమస్య తలెత్తిన వెంటనే అక్కడకు కొన్ని యూనియన్లు వాలిపోయి వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నాయి. వారు చేసే వైద్యం వికటించి చనిపోతే ఏదో ఒక రూపంలో సర్దుబాటు చేయడమో లేదా బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఆర్‌ఎంపీల చేతిలో బలైన ఘటనలపై అధికారులను విచారించినా..తనిఖీ చేసినా వెంబడిస్తున్నారు. ప్రధానంగా పీహెచ్‌సీ పరిధిలో పని చేసే అధికారులను బెదిరిస్తున్నారు. వారిపై తప్పుడు ప్రచారం చేయిస్తుండడంతో వారు కూడా చేసేదీ లేక మిన్నకుండిపోతున్నారు. ప్రస్తుతం ఆర్‌ఎంపీలు, పీఎంపీలను టచ్ చేస్తే కూటమి నేతల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయి. రెండు నెలల కిందట ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తే జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి ఫోన్ చేసి వాళ్ల జోలికి వెళ్లొద్దని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరించారు.. ఇటీవల జరిగిన ఓ ఆర్‌ఎంపీ ఘటనపై స్థానిక పీహెచ్‌సీ వైద్యుడికి బెదిరింపులు వస్తున్నాయి. దీంతో వారిపై చర్యలకు వెనుకాడుతున్నారు.

క్రీడాస్ఫూర్తి అవసరం


విద్యార్థిని అభినందిస్తున్న శ్రీధర్

చిత్తూరు కలెక్టరేట్: మురుగానపల్లిలోని న్యూయార్క్ పాఠశాలలో శనివారం చదరంగం పోటీలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, విద్యార్థులకు క్రీడాస్ఫూర్తి అవసరమని తెలిపారు. పోటీల్లో 2వ తరగతి విద్యార్థి ద్వారకా అర్జున్,, 9వ తరగతి విద్యార్థిని వర్షిణి, 7వ తరగతి విద్యార్థిని విక్రాంత్ తొలి మూడు బహుమతులు సాధించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య తెలిపారు. శనివారం రామభద్రాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచాన పడిన రోగుల నివాసాలకే వెళ్లి వైద్యం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, అనూరాధ, అనిత, ప్రవీణ్, శివగామి పాల్గొన్నారు.


సునీల్‌కుమార్‌ను కలిసిన అనుబంధ విభాగ అధ్యక్షులు

పార్టీ బలోపేతానికి కృషి

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలానికి చెందిన అనుబంధ విభాగాల అధ్యక్షులు పలమనేరులో సునీల్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామచంద్రా, ప్రచార విభాగం అధ్యక్షుడు రమణ, పంచాయతీ రాజ్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు బంగారుపాళెంలో కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మోక్షితారెడ్డికి అభినందనలు


మోక్షితారెడ్డిని అభినందిస్తున్న సభ్యులు

పలమనేరు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ లాంగ్‌జంప్ విభాగంలో వెండి పథకాన్ని సాధించిన పలమనేరు విద్యార్థిని మోక్షితా రెడ్డిని స్థానిక కాఫీ బడ్డీస్ సభ్యులు శనివారం అభినందించి ఆమెకు తర్వాత పోటీల కోసం స్పోర్ట్స్‌షూలను అందించారు. అమ్మాయికి శిక్షణనిచ్చిన స్థానిక కోచ్ జలాల్‌ను వారు అభినందించారు. ఇందులో సాయిచైతన్య కళాశాల ప్రిన్సిపల్ కిశోర్, కౌన్సిలర్ కుమార్, లక్ష్మీపతి, రామూర్తి, పూల లోకేష్ పాల్గొన్నారు.



తప్పిన ప్రమాదం

చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై నరహరిపేట సమీపంలో శనివారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. చిత్తూరు నుంచి వేలూరుకు ఓ వ్యాను వెళుతుండగా అందులోని ఇనుప పైపులు ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాయి. రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆ సమయానికి వాహనాలు రాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పైపులను పక్కకు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. -గుడిపాల

కౌంటర్లల్లో... ధరలు పట్టిక

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం: కాణిపాకంలోని పలు కౌంటర్లల్లో ఆ కౌంటర్ నిర్వాహకులు ధరల పట్టికలు పెట్టారు. 'సాక్షి' దినపత్రికలో 'అధికారమే పెట్టుబడి..దోపిడీనే రాబడి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈఓ పెంచల కిషోర్ ఆగ్రహానికి గురయ్యారు. కౌంటర్లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. మరోమారు వారిని కార్యాలయానికి పిలిచి బోర్డులు ఏర్పాటు చేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఏయే దానికి ఎంతెంత వసూలు చేయాలో ధరల పట్టికలు ఏర్పాటయ్యాయి. అదనపు వసూళ్లకు బ్రేకులు పడ్డాయి.



బ్యాగుల కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన ధరల పట్టిక

ఉద్యోగమేళాలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: బెంగళూరుకు చెందిన బహుళ జాతి కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించారని ఆర్‌కే డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. శనివారం మిట్టూరులోని కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వార్షిక వేతనంతో 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌లు హేమంత్, జితిన్, గ్రూపు ప్రతినిధులు సుస్మిత, జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.

కాయకు కవర్.. దిగుబడికి పవర్

- మామిడి కాయల సంరక్షణకు ప్రత్యేక కవర్లు
- ఎండలు, వడగండ్ల నుంచి రక్షణ
- నాణ్యమైన దిగుబడులకు దోహదం
- మ్యాంగో ఫ్రూట్ ప్రొటెక్ట్ కవర్లతో మంచి ఆదాయం
- జిల్లాలో రూ.1.90 కోట్ల కవర్లు ఇచ్చేలా లక్ష్యం
- 50 రాయితీతో అందిస్తామని ఉద్యానశాఖ అధికారుల వెల్లడి


మామిడి కాయిలకు కవర్లు తొడిగిన దృశ్యం (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వేసవి వస్తోందంటే చాలు..అందరూ మధుర ఫలం మామిడిని రుచి చూసేందుకు తహతహలాడుతుంటారు. ముఖ్యంగా మామిడి నాణ్యత కోసం రైతులు తిప్పలు పడుతుంటారు. కాయల సంరక్షణకు ప్రత్యేక కవర్లు వినియోగిస్తుంటారు. ఈ కవర్లను అందించేందుకు ఉద్యానశాఖ చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 1.90 కోట్ల కవర్లు ఇవ్వాలని లక్ష్యంగా చేసుకుంది. ఈ కవర్లను రైతులకు 50 శాతం రాయితీతో అందించేందుకు సిద్ధమైంది. జిల్లాలో సుమారు 58 వేలకు పైగా హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది. మామిడిలో ఎక్కువ భాగం గుజ్జు పరిశ్రమకు ఉపయోగించే తోతాపూరి రకం ఉంటోంది. టేబుల్ వెరైటీస్‌గా పిలవబడే బంగినపల్లి, ఇమామ్ పసంద్, మల్లూబ, రసాలు మల్లిక వంటి మామిడి రకాలు కూడా వ్యాపించి ఉన్నాయి. పూత ఆరంభం నుంచే తెగుళ్లు పంటపై దాడి చేస్తుంటాయి. వీటి నుంచి పంటను సంరక్షించి నాణ్యమైన దిగుబడి కోసం రైతులు పట్టుపడుతుంటారు. ఈ క్రమంలో టేబుల్ వెరైటీస్‌పై దృష్టి సారిస్తుంటారు. వీటిని తినే అవసరాలకు పోను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో కాయకు తెగుళ్లు, మచ్చలు, లేకుండా చూసుకునేందుకు రైతులు పలు చర్యలు తీసుకుంటున్నారు.

రాయితీతో ఫ్రూట్ కవర్లు

ఉద్యాన శాఖ అధికారులు మామిడి సీజన్ దృష్ట్యా జిల్లాలో 1.90 కోట్ల ఫ్రూట్ కవర్స్ అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఫ్రూట్ కవర్స్ వాడటం వల్ల ఆ మామిడి కాయలు వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉండడంతో పాటు లోపలికి ఎటువంటి వ్యాధులు రాకుండా కాపాడగలవు. కవర్ లోపల భాగం నలుపు రంగులో ఉండటం వల్ల మామిడికాయకు మంచి ఉష్ణోగ్రత లభిస్తుంది. దీంతో నాణ్యత గల మామిడి దిగుబడి అవుతుంది. ఒకపక్క సేంద్రియ వ్యవసాయం , మరో పక్క ఈ ఫ్రూట్ కవర్లను వాడడం ద్వారా ఎటువంటి వ్యాధులు లేని సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన మామిడి ఉత్పత్తులు లభిస్తాయి. ఈ కారణంగా మామిడి పండ్లకు ధరలు కూడా బాగా పలుకుతాయి. ఈ కవర్లను వాడే వారికి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం పైగా ఈ ఫ్రూట్ కవర్ లభ్యం అవుతోంది. ఒక్కో రైతుకు 10 వేల వరకు కవర్లు ఇవ్వనున్నారు.

లాభాలు ఇలా...

కవర్ల కట్టడం వల్ల అనేక రకాల లాభాలున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మామిడి రంగు ఆకర్షణీయంగా ఉంటుంది. తెగుళ్లు, పండు ఈగ, తామర పురుగులు వంటివి ఆశించవు. కాయ మంచిగా వృద్ధి చెందుతుంది. గాలికి రాలిపోవడాన్ని నివారించవచ్చు. ఎండ బొబ్బలు, వడగండ్ల వాన వల్ల కలిగే నష్టాలను అధిగమించవచ్చునన్ని అధికారులు వివరిస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులు పంట దిగుబడిని పెంచుకోవడంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటపై పలు ప్రభావాలు చోటు చేసుకుంటున్నాయి. వీటి నివారించేందుకు రైతులు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఫ్రూట్ ప్రొటెక్ట్ కవర్లు రెండేళ్లుగా వాడుతున్నారు. ఈ కవర్లను 50 శాతం రాయితీతో ఉద్యాన శాఖ కార్యాలయాల్లో అందిస్తాం. ఒక్కో రైతుకు 10 వేల వరకు ఇస్తాం. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–మధుసూదన్ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, చిత్తూరు

హనుమంతునిపై వేణుగోపాలుడి చిద్విలాసం


హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వి.కోట: పట్టణంలో మూడు రోజులుగా కోలాహలంగా సాగుతున్న వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుడు హనుమంత వాహనంపై పురవీధుల్లో భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి హనుమంత వాహనంపై స్వామి వారిని మంగళవాయిద్యాలు నడుమ ఊరేగించారు. మహిళలు అడుగడుగునా స్వామివారికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్త సీతారామయ్య పాల్గొన్నారు.